సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



కుండపోత వర్షం

జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు కుండపోత వర్షం కురవగా వాగులు, చెరువులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. 10లో



మక్కలు కొంటారా? కొనరా?

జిల్లాలో లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా.. దిగుబడి వచ్చినా ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకాలేదు. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 23°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు నిత్యకల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జిల్లా జడ్జిని కలిసిన ఎఫ్‌డీఓ



జడ్జికి మొక్క అందిస్తున్న ఎఫ్‌డీఓ

పాల్వంచరూరల్ : ఇటీవల ఏర్పాటైన వైల్డ్‌లైఫ్ నల్సా కమిటీ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా జడ్జి పాటిల్ వసంత్‌ను వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ, నల్సా జిల్లా నోడల్ అధికారి బి.బాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై ఉంచిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని చెప్పారు.

భోజనంలో నాణ్యత పాటించాలి

ఎస్సీ డీడీ శ్రీలత



రికార్డులు పరిశీలిస్తున్న శ్రీలత

పినపాక: సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత పాటించాలని డీడీ శ్రీలత సిబ్బందిని ఆదేశించారు. పినపాక హాస్టల్‌లోని భోజనశాల, విద్యార్థుల గదులు, పరిసరాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులుంటే తమకు సమాచారం అందించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలో చదువుతున్న 9, 10 తరగతి బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాల మంజూరు కోసం ఈ–పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పి.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. https:// telanganaepass. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఏడాది ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు మించి ఉండొద్దని, మీ సేవ ద్వారా తహసీల్దార్‌తో ధ్రువీకరించిన ఆదాయ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బీసీ ధ్రువీకరణ పత్రం, విద్యార్థి బ్యాంక్ పాస్‌బుక్, తల్లి/తండ్రి జాయింట్ ఖాతాతో తెరచిన జిరాక్స్ కాపీ జత చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయంలో అందజేయాలని వివరించారు.

ప్రజావాణి వెలవెల

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై 11 దరఖాస్తులు వచ్చాయని ఆర్డీఓ మధు తెలిపారు. కొత్తగూడెం మున్సిపాలిటీ నుంచి 3, చుంచుపల్లి మండలం నుంచి 4, జూలూరుపాడు, టేకులపల్లి, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాల నుంచి ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే వచ్చాయి. మొత్తంగా ఫిర్యాదుదారులు ఎక్కువగా లేకపోవడంతో గ్రీవెన్స్ సెల్ వెలవెలబోయింది.

పంటలు హరీ !



పినపాక మండలం చింతల బయ్యారంలోని మిరప తోటలో నిలిచిన నీరు

- చేతికందే సమయంలో భారీ వర్షాలు
- దెబ్బతింటున్న పత్తి, వరి, మొక్కజొన్న
- పెట్టుబడులు కూడా తిరిగి రావని రైతుల ఆందోళన

బూర్గంపాడు: ఈ ఏడాది వర్షాలు రైతుల వెన్ను విరుస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే చేతికందే సమయాన భారీ వర్షాలతో దెబ్బతింటున్నాయి. పత్తి తీసే దశకు వచ్చినా వానలతో వీలుపడడం లేదు. కంకి దశలో ఉన్న వరిపొలాలు వర్షాలకు ఒరిగిపోతున్నాయి. ఇటీవలే వేసిన మిరప తోటల్లో నీరు నిల్వడంతో మొక్కలు కుళ్లిపోతున్నాయి. మొక్కజొన్న పంటదీ ఇదే పరిస్థితి. ఓవైపు యూరియా కొరతతో నానా ఇబ్బందులు పడిన రైతులు.. ప్రస్తుత ఎడతెరిపి లేని వర్షాలతో కుదేలవుతున్నారు. పెట్టుబడులు కూడా తిరిగి రావని ఆందోళన చెందుతున్నారు.

మొదట ఆశాజనకంగానే..

జిల్లాలో ఈ ఏడాది వానాకాలం పంటలు సాగు ఆశాజనకంగానే ప్రారంభమైంది. జూన్, జూలైలో అడపా దడపా కురిసిన వర్షాలకు పత్తి, మొక్కజొన్న, అపరాల పంటలు బాగానే మొలకెత్తాయి.



బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజరలో నేలవాలిన వరి

నెలన్నర రోజుల వరకు పంటలు ఏపుగా పెరిగి రైతుల్లో ఆశలు కల్పించాయి. ఇక ఆగస్టు నుంచి ఆరంభమైన వానలు రైతులను రోజురోజుకూ కుంగదీస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలతో పాటు యూరియా కొరత కూడా వారిని తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసింది. యూరియాకు బదులు ఎక్కువ ఖర్చు చేసి కాంప్లెక్స్ ఎరువులు వేసుకుని పంటలు సాగు చేశారు. అయితే అధిక వర్షాలతో వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు తెగుళ్ల ఉధృతి ఎక్కువై పంటలకు నష్టం కలిగించాయి. దీంతో సస్యరక్షణ చర్యలకు అధికంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ప్రస్తుతం పత్తి తొలివిడత తీసేందుకు సిద్ధమైంది. కానీ వర్షాలతో వీలు పడడం లేదు.

వరి పంటకూ ప్రతికూలం..

జిల్లాలో సాగు చేసిన వరి పంట ప్రస్తుతం కంకి వెళ్లే దశలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో పొట్టదశలో, మరికొన్ని చోట్ల కంకి వెళ్లి గింజపోసుకునే దశలో ఉన్నాయి. అయితే గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రతికూలంగా మారాయి. వరిపొట్టలోకి నీరు చేరడంతో చీడపీడలు ఎక్కువవుతున్నాయి. కంకి వెళ్లిన పంటలో సుంకు రాలిపోతోంది. కంకి వెళ్లి గింజపోసుకుంటున్న వరి వానలకు నేలవాలుతోంది. మొక్కజొన్న పంటకు కూడా వర్షాలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. అధిక వానలతో కంకి సరిగా రావడం లేదని రైతులు చెబుతున్నారు. ఇక ఇటీవల వేసిన మిర్చి తోటలకు కూడా వానలు ప్రతిబంధకంగా మారాయి. మొక్కలు ఎర్రబారి చనిపోతున్నాయి.

చెరువులను తలపిస్తున్న పంట చేలు..

జిల్లాలో ఈ ఏడాది 2.21లక్షల ఎకరాల్లో పత్తి, 1.85లక్షల ఎకరాల్లో వరి, 28వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. సుమారు పదివేల ఎకరాల్లో మిర్చి సాగు చేసే అవకాశం ఉండగా ఇప్పటికే ఆరువేల ఎకరాల్లో సాగైంది. ప్రస్తుతం పత్తి చేతికందే దశలో ఉండగా వారం, పది రోజుల్లో వరి కోతలు కూడా ప్రారంభం కావాల్సి ఉంది. ఈ తరుణంలో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలు చెరువులను తలపిస్తుండగా రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, చెరువులు పొంగిప్రవహిస్తున్నాయి. భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం, అశ్వారావుపేట వ్యవసాయ డివిజన్లలో వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

పత్తితీసే పరిస్థితి లేదు



పది రోజుల నుంచి పత్తి తీయాలనుకుంటే తరచూ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పంట చేలోనే తడుస్తోంది. అది ఆరేలోపే మళ్లీ వాన పడుతోంది. ఇప్పటికే పత్తి కాయలు నల్లబడి కుళ్లిపోతున్నాయి. పూసిన పత్తి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు.

– వై నర్సింహారెడ్డి, బూర్గంపాడు

మిరపతోటలో నీరు..



ఇరవై రోజుల క్రితం వేసిన మిరప తోటలో నీరు నిలిచింది. నీళ్ల బయటకు పంపేందుకు కాల్వలు తీసినా వర్షం ఆగకపోవడంతో మొక్కలు కుళ్లిపోతున్నాయి. కొన్ని మొక్కలు అసలే చనిపోయాయి. మళ్లీ వేయాలంటే పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి.

– నర్సింహారావు, చింతల బయ్యారం, పినపాక మండలం

పంటలను కాపాడుకోవాలి



పంట చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. పత్తి, మిర్చి తోటల్లో నీరు నిల్వకుండా కాల్వలు తీయాలి. వర్షాలు ఆగిన వెంటనే తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. రైతులు మందులు పిచికారీ చేసే సమయంలో నానో యూరియాను కూడా కలిపితే మెరుగైన ఫలితాలుంటాయి. పత్తిలో తేమ పూర్తిగా ఆరాకే తీయాలి.

– బి తాతారావు, ఏడీఏ, మణుగూరు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీడీఏ పీఓ రాహుల్
- గిరిజన దర్బార్‌లో దరఖాస్తుల స్వీకరణ



దర్బార్‌లో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ రాహుల్

భద్రాచలం : ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి దర్బార్‌కు వచ్చే గిరిజనుల సమస్యలను అర్హతల మేరకు సకాలంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఆయా వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ అశోక్, ఈఈ మధుకర్, గురుకులాల ఆర్సీఓ అరుణకుమారి, ఏడీఎంహెచ్ఓ సైదులు, ఏఓ రాంబాబు, ఇన్‌చార్జ్ ఎస్ఓ భాస్కరన్, ఉద్యాన అధికారి ఉదయ్‌కుమార్, ఏపీఓ(పవర్) వేణు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహిచాలి..

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని పీఓ రాహుల్ సిబ్బందికి సూచించారు. ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ కార్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సర్వీస్ బుక్‌ల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీడీ అశోక్, పర్యవేక్షకురాలు ప్రమీలబాయ్, సిబ్బంది రమణమూర్తి, రామకృష్ణారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

రామాలయంలో మళ్లీ అంతర్గత బదిలీలు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో సోమవారం మళ్లీ అంతర్గత బదిలీలు చేశారు. ఈఓ కొల్లు దామోదర్‌రావు బాధ్యతలు స్వీకరించాక ఇది రెండోసారి. ఈఓ సీసీ, గోశాల ఫైల్ కరస్పాండెన్స్ ఎ.శ్రీనివాసరెడ్డికి సెంట్రల్ స్టోర్స్ ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు, సీనియర్ అసిస్టెంట్ ఆర్.బాలాజీని అన్నదాన సత్రం ఇన్‌చార్జ్ నుంచి ప్రసాదాల తయారీవిభాగానికి, ప్రసాదాల విభాగంలో పని చేస్తున్న శ్రీనివాసరావును పర్ణశాల గుమస్తా, ఆ పోస్టులో ఉన్న కన్సాలిడేటెడ్ ఎం.అనిల్‌కుమార్‌ను దేవస్థానంలో కీలక విభాగమైన ఎస్టాబ్లిష్‌మెంట్, పే బిల్స్‌కు బదిలీ చేశారు. ఎస్టాబ్లిష్‌మెంట్ క్యాషియర్ టి.రాజేష్‌ను డిపాజిట్, డీడీ, ఇతర రిజిస్టర్లకు, ప్రసాదాల విభాగంలో ఉన్న సతీష్‌ను ఈఓ అటెండర్‌గా, ఈఓ అటెండర్‌గా ఉన్న నందసాయిని ప్రసాదాల ఇన్‌చార్జ్‌గా, కంప్యూటర్ ఆపరేటర్ ఎం.మృణాళినిని ఇంజనీరింగ్ సెక్షన్ ఓఎస్‌గా, ఫైల్ కరస్పాండెన్స్‌గా, సునీతకు ప్రొటోకాల్ ఆఫీస్ ఇన్‌చార్జ్‌గా, వస్త్రాల స్టోర్స్ ఇతర బాధ్యతలు అప్పగించారు.



రామాలయం

కాంట్రాక్ట్ ఉద్యోగులకు కీలక బాధ్యతలు..?

ఈఓ బాధ్యతలు స్వీకరించిన అనతికాలంలోనే రెండుసార్లు అంతర్గత బదిలీలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇవి సాధారణమే అయినా అన్ని విభాగాల్లో ఒకేసారి పెను మార్పులు చోటుచేసుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. ఇక ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న కొందరికి కీలక విభాగాలు అప్పగించడంపై కొందరు అభ్యంతరం తెలుపుతున్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

భద్రాచలం : నిరుద్యోగ గిరిజన యువతకు మెడక్ ఐటీసీ, ఇంటిగ్రేటెడ్ కన్స్యూమర్ గూడ్స్ తయారీ, లాజిస్టిక్ (ఐసీఎంఎల్) గండుపల్లి మెడక్ ఆధ్వర్యంలో ఈనెల 15న మణుగూరు ఐటీఐలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఒకేషనల్‌తో పాటు ఐటీఐ చేసి, 18 నుంచి 29 సంవత్సరాలు ఉన్న వారు మిషన్ ఆపరేటర్ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. మొత్తం 40 సీట్లలో గిరిజన మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని, ఆసక్తి గల గిరిజన యువత ఈనెల 15న జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు (ఐసీఎంఎల్) ఐటీసీ మెదక్ జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఐదు పతకాలు

కొత్తగూడెంటౌన్: ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు హనుమకొండలో జరిగిన ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రీడాకారులు ఐదు పతకాలు సాధించారని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి తెలిపారు. స్థానిక ఐడీఓసీలో సోమవారం ఆయన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖోఖో పోటీలో మధిరకు చెందిన బి.జాహ్నవి, ఇల్లెందుకు చెందిన పి.భువనశ్రీ, నేలకొండపల్లికి చెందిన బి.రూప బంగారు పతకాలు, ఎర్రుపాలెంకు చెందిన కె.సానియా రజిత పతకం, అన్నపురెడ్డిపల్లికి చెందిన టీ.హాసిని కాంస్య పతకం సాధించారని వివరించారు. క్రీడాకారులు మరింతగా రాణించి జిల్లా ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.



క్రీడాకారులతో డీవైఎస్ఓ పరంధామరెడ్డి

మెడికల్ కాలేజీ వెబ్‌సైట్‌పై గందరగోళం

చుంచుపల్లి: 2025–26 విద్యాసంవత్సరానికి కొత్తగూడెం వైద్య కళాశాలలో డీఎంఎల్‌టీ 30, డయాలసిస్ టెక్నీషియన్ 30 సీట్ల భర్తీ కోసం ఇటీవల ప్రిన్సిపాల్ ఎం.హరిరావు ప్రకటన విడుదల చేశారు. ఇందుకు దరఖాస్తు చేసుకునేందుకు అందుబాటులో ఉంచిన వెబ్‌సైట్ కొంత గందరగోళంగా ఉందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. వెబ్‌సైట్‌ను వెదకటానికి నానా తంటాలు పడాల్సి వస్తోంది. నేరుగా వెబ్‌సైట్ అడ్రస్ ఇవ్వకపోవడంతో రెండు, మూడు ఆప్షన్లకు వెళ్లి ఒకటికి రెండుసార్లు లాగిన్ అయితే తప్ప దరఖాస్తు తీసుకోవడం లేదు. ఈ నెల 28 వరకే దరఖాస్తులకు అవకాశం కల్పించగా, ప్రస్తుతం ఇచ్చిన వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుకోవాలంటే సవాల్‌గా మారిందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ మెడికల్ కళాశాల యాజమాన్యం స్పందించి సులువైన వెబ్‌సైట్ ఆప్షన్ అందుబాటులోకి తేవాలని అభ్యర్థులు కోరుతున్నారు.

బీటీపీఎస్ ఎదుట ఆదివాసీల ఆందోళన

బీటీడీఏ సొసైటీలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్



బీటీపీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

మణుగూరు టౌన్ : బీటీపీఎస్‌లో స్థానిక వీటీడీఏ సొసైటీలకు, స్థానికులకు అవకాశాలు కల్పించాలని, కమీషన్లు తీసుకుని టెండర్లు అప్పగించే సంస్కృతికి స్వస్తి పలకాలని ఆదివాసీ అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో ప్లాంట్ ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్ చందా లింగయ్య దొర మాట్లాడుతూ.. బీటీపీఎస్ కోసం సేకరించిన భూముల్లో 95 మంది గిరిజనేతరులకు చెందినవి 138 ఎకరాల ఉంటే 767 ఎకరాల భూము లున్నట్లు రికార్డులు మార్చి రెవెన్యూ అధికారులు, జెన్కో, బీటీపీఎస్ అధికారులు కోట్ల రూపాయలు కాజేశారని ఆరోపించారు. 1,116 మంది ఆదివాసీల భూములు 2,044 ఎకరాలు ఉండగా 302 మందికి మాత్రమే ప్యాకేజీలు ఇచ్చారని, మిగిలిన వారిని మోసం చేశారని అన్నారు. భూ సేకరణ సమయంలో జీవనోపాధికి నెలకు రూ.5వేలు, గృహ నిర్మాణం, సమీప గ్రామాల అభివృద్ధి వంటి హామీలు ఇచ్చారని, ఇప్పుడు అవన్నీ తుంగలో తొక్కారని విమర్శించారు. అవసరమైతే ప్లాంట్ భూములను రీ సర్వే చేసి అర్హులకు ప్యాకేజీ, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీటీపీఎస్ వస్తే బతుకులు బాగుపడతాయి అనుకుంటే స్థానికులకు ఉపాధి కూడా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూ నిర్వాసితులంటే ప్లాంట్ అధికారులకు చులకనగా మారిందన్నారు. బూడిద చెరువు, బూడిద రవాణా విధానం టెండర్లను ఆదివాసీ వీటీడీఏ సొసైటీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ప్లాంట్ సీఈ బిచ్చన్నకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు నివేదిస్తున్నామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, నాయకులు వాసం రామకృష్ణ, కొమరం రాముమూర్తి, కొమరం శ్రీను, కలేటి వీరయ్య, చిడెం నాగేశ్వరరావు, కుంజా వెంకటరమణ, ఏనిక మంగమ్మ, పూనెం విజయలక్ష్మి తదితరులు ఉన్నారు. కాగా, ఆదివాసీ అఖిలపక్ష సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ప్లాంట్ ఎదుట తలపెట్టిన నిరసనలో అక్రమాల అధికారి తీరుపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలే ప్లకార్డులుగా మారాయి. భూములు సేకరించిన అనంతరం వీటీడీఏ సొసైటీలకు ప్రాధాన్యత తగ్గడం తదితర అంశాలపై సాక్షిలో కథనాలు ప్రచురితమైన విషయం విదితమే.

కిన్నెరసానికి వరద పోటు



కిన్నెరసాని నుంచి దిగువకు విడుదలవుతున్న వరద

ఐదు గేట్లు ఎత్తి 24 వేల క్యూసెక్కుల నీరు విడుదల

పాల్వంచరూరల్ : జిల్లాతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద పోటెత్తింది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో నీటిమట్టం సోమవారం 406.70 అడుగులకు పెరిగింది. దీంతో ఐదు గేట్లు ఎత్తి 20వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు డ్యామ్‌సైడ్ పర్యవేక్షక ఇంజనీర్ తెలిపారు.

పర్యాటకులకు నిరాశే..

కిన్నెరసాని జలాశయం ప్రాజెక్టు గేట్లు ఎత్తితే చూడాలనే ఉత్సాహంతో పలువురు రాగా, గేటుకు తాళం వేయడంతో పర్యాటకులకు నిరాశే మిగిలింది. కాగా, ఆ సమయంలోనే పంజాబ్ రాష్ట్రంలోని బర్నాల్ నుంచి కొందరు చేరుకోగా, గేట్లు మూసి ఉండడం, బోటు షికారు కూడా నిలిపివేయడంతో నిరాశగా వెనుదిరిగారు. గేట్లు తెరిస్తే సెల్ఫీల కోసం పోటీ పడుతున్నారని, ఆ సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతోనే పర్యాటకులను లోనికి అనుమతించడం లేదని అధికారులు వెల్లడించారు.

జిల్లాలో 49.8 మి.మీ. వర్షం

- అత్యధికంగా మణుగూరులో 128.4 మి.మీ.
- అత్యల్పంగా జూలూరుపాడులో 2 మి.మీ.

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా వ్యాప్తంగా సోమవారం సగటు వర్షపాతం 49.8 మి.మీ.గా నమోదైంది. మణుగూరు మండలంలో అత్యధికంగా 128.4 మి.మీ. వర్షం కురవగా, జూలూరుపాడు మండలంలో అత్యల్పంగా 2 మి.మీ. నమోదైంది. మిగిలిన మండలాల వారీగా.. కరకగూడెంలో 88.2 మి.మీ., పినపాకలో 58.6, చర్లలో 95.6, దుమ్ముగూడెంలో 52.4, అశ్వాపురంలో 110.6, ఆళ్లపల్లిలో 5, గుండాలలో 106.4, ఇల్లెందులో 20.2, టేకులపల్లిలో 41.2, చంద్రుగొండలో 7.2, అన్నపురెడ్డిపల్లిలో 35.2, చుంచుపల్లిలో 18.6, సుజాతనగర్‌లో 11.4, కొత్తగూడెంలో 27.4, లక్ష్మీదేవిపల్లిలో 33.6, పాల్వంచలో 31.2, బూర్గంపాడులో 103.6, భద్రాచలంలో 42.2, ములకలపల్లిలో 47.2, దమ్మపేటలో 13, అశ్వారావుపేట మండలంలో 5.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం కంటే 28.1 శాతం అధికంగా నమోదైంది.

హోరెత్తిన తాలిపేరు..



తాలిపేరు నుంచి దిగువకు విడుదల చేస్తున్న నీరు

11 గేట్లు ఎత్తి 21 వేల క్యూసెక్కుల నీరు విడుదల

చర్ల: తాలిపేరు ప్రాజెక్టులోకి వరద భారీగా చేరుతుండగా 11 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు ఎగువన ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తుండగా ప్రాజెక్టులోకి వరద పోటెత్తుతోంది. దీంతో సోమవారం ప్రాజెక్టులోని 10 గేట్లను రెండడుగుల చొప్పున, 1 గేటును పూర్తిగా ఎత్తి 21,076 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి నేపథ్యంలో నీటిమట్టాన్ని 73.23 మీటర్లు ఉంచి మిగిలిన నీటిని బయటకు వదులుతున్నారు. డీఈ తిరుపతి ప్రాజెక్టు వద్దే ఉండి పరిస్థితిని సమీక్షిస్తూ అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్నారు.

క్లుప్తంగా

అండర్-17 ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: అండర్-17 విభాగంలో ఉమ్మడి జిల్లా బాలబాలికల వాలీబాల్ జట్లను సోమవారం ఎంపిక చేశారు. జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు పెద్దసంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో బాలురు అత్యధికంగా రావడంతో తొలుత 100మందిని గుర్తించి, స్క్రీనింగ్ అనంతరం వారిలో నుంచి జట్టును ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా బాలుర జట్టుకు యు.ఉదయ్ ముఖేష్, బి.నందకిషోర్, బి.చరణ్, ఎం.సాయిక్షయ్‌కుమార్, ఎస్.కే.షరీఫ్, ఎం.ధనుంజయ్, కె.నవీన్, బి.చేతన్, డి.రోహన్, పి.సాయిరాంతో పాటు స్టాండ్ బైగా బి.గణేష్, ఎస్.కే.ముద్దషీర్ ఎంపికయ్యారు.అలాగే, బాలికల జట్టుకు జి.హాసిని, కె.అమృత, బి.నాగేశ్వరి, పి.అనూష, బి.శ్వేత, బి.గౌతమి, వి.లావణ్య, టి.ఉమారాణి, హెచ్.భార్గవి, స్టాండ్ బైగా పి.కరుణ్యా, కె.చరితరెడ్డి ఎంపిక చేశారు.

చిరుతపులి గోర్ల తస్కరణ..

ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): చనిపోయిన చిరుతపులి గోర్లను తస్కరించిన వ్యక్తికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కే.సాయిశ్రీ సోమవారం తీర్పు వెల్లడించారు. 2016లో అబ్బుగూడెం బీట్ పరిధిలో కంపార్ట్‌మెంట్-35 అటవీ ప్రాంతంలో రెండు చిరుతపులులు రెండు మేకలపై దాడి చేసి హతమార్చాయి. గుర్తించిన బాధిత రైతు మేకల కళేబరాలపై పురుగుల మందు చల్లాడు. వాటిని తిన్న రెండు చిరుతలు మృత్యువాతపడ్డాయి. అటవీశాఖ బీట్ ఆఫీసర్ రమేష్ బాబు సంఘటనా స్థలాన్ని సందర్శించి, చిరుతపులి గోర్లను తస్కరించినట్లు గుర్తించారు. దీంతో అటవీశాఖ అధికారులు అబ్బుగూడెం గ్రామానికి చెందిన బూస సత్యం, పోతిని మంగయ్య, బూస హనుమంతరావు, కర్రి ఆశయ్య, ఎం. లక్ష్మారెడ్డి, ఎం.లక్ష్మయ్యలపై కేసు నమోదు చేశారు. ఆరుగురిలో లక్ష్మయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఎం. లక్ష్మారెడ్డి ముద్దాయిగా కోర్టు తీర్పు ఇచ్చింది. మిగిలిన వారిపై నేరం రుజువుకాలేదు.

యువకుడు ఆత్మహత్య

పాల్వంచ: ఓ యువకుడు సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక నవభారత్ గాంధీనగర్‌కు చెందిన పసుపులేటి ప్రవీణ్(24) శివనగర్‌లోని బోరింగ్ షాపులో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం పనికి వెళ్లిన ప్రవీణ్ షాపులో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు మధ్యాహ్నం ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో షాపు వద్దకు వెళ్లి చూడగా ఉరివేసుకుని ఉన్నాడు. ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఓ యువతిని రెండేళ్లుగా ప్రేమిస్తున్నాడని, ఆమె ప్రేమను అంగీకరించకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తండ్రి రమణయ్య ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,400

అశ్వారావుపేటరూరల్: దొంతికుంట ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి చేరిన వరదనీరు



కరకగూడెం: వీరాపురంలో నేలవాలిన వరి పొలం



కుండపోత వర్షం

- ఉప్పొంగిన వాగులు, లోతట్టు ప్రాంతాలు జలమయం
- రహదారులపైకి వరదనీరు చేరి రాకపోకలకు అంతరాయం

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు కుండపోత వర్షం కురిసింది. వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులు, కుంటలు అలుగు పోంగాయి. పంటలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. పలుచోట్ల రోడ్లపైకి వరదనీరు చేరింది. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో కిన్నెరసాని, జల్లేరు, ఏడుమెళికల వాగులు ఉధృతరూపం దాల్చాయి. ఆళ్లపల్లి-కొత్తగూడెం మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

- మణుగూరులో భారీ వర్షం కురిసింది. మున్సిపాలిటీలోని పలు వీధుల్లోకి వరద నీరు చేరింది. మంగళగట్టు, గాంధీ బొమ్మసెంటర్, వినాయకనగర్, శ్రీశ్రీ నగర్ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు నీట మునగడంతో ప్రజలు ఇళ్లలోనే ఉండిపోయారు. శాంతినగర్‌లో ఇళ్లను, వాగు మల్లారం డబుల్ బెడ్రూం సముదాయాన్ని వరద నీరు చుట్టు ముట్టింది. వాసవీ సుర్షా బస్టాండ్ వద్ద కార్గో కార్యాలయంలోకి వర్షపు నీరు చేరింది. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, తహసీల్దార్ నరేశ్ పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. సింగరేణిలో ఓబీ, బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోడిపుంజుల వాగు ఉధృతంగా ప్రవహించడంతో పూనెం వారి గుంపు నివాసాలు మునుగుతున్నాయని స్థానికులు ఆందోళన చేపట్టారు. సింగరేణి, పోలీస్ అధికారులు అక్కడకు చేరుకుని నచ్చజెప్పారు.
- అశ్వారావుపేట మండలంలో అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వెళ్లే మార్గంలో నారంవారిగూడెం వద్ద వరదనీరు చేరి జాతీయ రహదారి వాగును తలపించింది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీ పరిధిలోని దొంతికుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వర్షపు నీరు చేరింది. మున్సిపల్ కమిషనర్ బానోతు నాగరాజు వెళ్లి వరదనీరు వెళ్లదీసే చర్యలు చేపట్టారు. పెదవాగు ప్రాజెక్ట్ రింగ్‌బండ్‌కు 6.1 మీటర్ల మేర వరద పోటెత్తడంతో మూడు గేట్లను ఎత్తివేసి నీటిని గోదావరిలోకి వదిలారు.
- దుమ్ముగూడెం మండలంలో పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం వద్ద నారచీరల ప్రాంతం జలమయంగా మారింది. సీతవాగుకు భారీగా వరద నీరు చేరడంతో సీతమ్మ విగ్రహం నీట మునిగింది.
- పినపాక మండలం సాంబయ్యగూడెం సమీపంలో రోడ్డుపై వరద నీరు చేరి మణుగూరు-ఏటునారుగారం మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చింతల బయ్యారం, వెంకటరావుపేట గ్రామాల్లో మిర్చి పంట నీట మునిగింది. కరకగూడెం మండలంలో పలు గ్రామాల్లో వరద నీరు చేరింది. పెద్దవాగు, బూడిదవాగు తదితర వాగులు ఉధృతంగా ప్రవహించాయి. వరి పొలం నీట మునిగింది. అశ్వాపురం, ములకలపల్లి మండలాల్లో కూడా వాగులు ఉధృతంగా ప్రవహించాయి. తుమ్మలచెరువు అలుగు రెండు అడుగుల మేర ప్రవహిస్తోంది.



ములకలపల్లి: పొగళ్లపల్లి శివారులోని చప్టాపై వరద ఉధృతిలో దాటిస్తున్న బైక్



దుమ్ముగూడెం: నీట మునిగిన నారచీరల ప్రాంతం



అశ్వాపురం: ఎలకలగూడెంలో పొంగి ప్రవహిస్తున్న ఇసుకవాగు



గుండాల: కొడవటంచ వద్ద బ్రిడ్జిపై నుంచి పొంగుతున్న కిన్నెరసాని వాగు



పినపాక: సాంబయ్యగూడెం వద్ద మణుగూరు -ఏటూరునాగారం రహదారిపై వరద..



మణుగూరు టౌన్: వినాయక నగర్‌లోని ఓ వీధిలో ముంచెత్తిన వరద నీరు



అశ్వారావుపేటరూరల్: పెదవాగు నుంచి విడుదలవుతున్న వరద



కరకగూడెం: ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు



మణుగూరు టౌన్: ఆందోళనకారులకు నచ్చజెబుతున్న అధికారులు



అశ్వారావుపేటరూరల్: నారంవారిగూడెం వద్ద జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు

వ్యక్తి ఆత్మహత్య

కొత్తగూడెంటౌన్: అప్పు ఇచ్చిన వారి వేధింపులు తాళలేక పాత కొత్తగూడేనికి చెందిన మెరుగు నాగరాజు(45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. నాగరాజు గతంలో బట్టల షాపులో పని చేశాడు. ప్రస్తుతం పాత కొత్తగూడెంలో ఉంటూ ఇడ్లీ బండిని నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి బాబుక్యాంప్‌నకు చెందిన సదామోహన్‌రావు, రాములు రూ.10 లక్షలు అప్పు ఇచ్చారు. అప్పు వసూలుకు 10 రోజుల క్రితం నాగరాజు ఇంటికి వెళ్లినవారు బెదిరింపులకు పాల్పడ్డారని సమాచారం. ఆ వేధింపులు తాళలేక అదే రోజు గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు భాస్కర్ ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.కరుణాకర్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పోడు కేసులో నిందితుడి అరెస్ట్

చంద్రుగొండ: పోడు కేసులో నిందితుడిని సోమవారం అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. మండలంలోని రావికంపాడుకు చెందిన కుసాలు శ్రీను అనే వ్యక్తి 2022 సంవత్సరంలో పోడు కేసులో నిందితుడిగా ఉన్నాడు. కోర్టు వాయిదాలకు సక్రమంగా హాజరుకాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచి, జైలుకు తరలించినట్లు ఎఫ్ఆర్వో ఎల్లయ్య తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు

దమ్మపేట: మండలంలోని పెద్దగొల్లగూడెం గ్రామంలో యదిరాజు కన్నయ్యకు చెందిన తాటి ఆకుల పూరిల్లు సోమవారం ఒక్కసారిగా కుప్పకూలిపోగా, ఇంటి పైకప్పు నేలను తాకింది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దగొల్లగూడెం గ్రామంలో కన్నయ్య, పున్నమ్మ దంపతులు తమ ఇద్దరు కుమార్తెలతో ఓ పూరి గుడిసెలో నివాసం ఉంటున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి కట్టిన తడికెలు, పైకప్పు కలప బాగా తడిసి పటుత్వం కోల్పోయాయి. సోమవారం ఉదయం వర్షం కురుస్తుండగానే ఒక్కసారిగా పూరిల్లు కూలిపోయింది. ఇంట్లో వంట సామగ్రి, నిత్యావసరాలు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. సర్వస్వం కోల్పోయిన తమను ఆదుకోవాలని కన్నయ్య కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



కుప్పకూలిన పూరి గుడిసె వద్ద బాధిత కుటుంబ సభ్యులు

ఇద్దరు బాలికలు అదృశ్యం... ఖమ్మంలో ప్రత్యక్షం

దమ్మపేట: మండలంలోని అంకంపాలెం గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ఆదివారం అదృశ్యమయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉదయం 7:30 నుంచి బాలికలు కనిపించకపోవడంతో ఇంగ్లిష్ జూనియర్ లెక్చరర్ హరిత వారి ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో వెతికించినా ఫలితం లేకపోవడంతో సత్తుపల్లి మండలం రేగళ్లపాడులోని బాలికల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత లెక్చరర్ హరిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు. కాగా, బాలికలు సూర్యాపేట వరకు వెళ్లి.. తమకు చదువుకోవడం ఇష్టం లేదని తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. దీంతో వారు బుజ్జగించి తిరిగి రావాలని సూచించగా ఖమ్మం బస్టాండ్‌కు చేరుకునేసరికి కళాశాల లెక్చరర్ అక్కడికి వెళ్లి.. దమ్మపేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీంతో కేసు ఉపసంహరించినట్లు పోలీసులు వెల్లడించారు.

మహిళ బలవన్మరణం

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగుకి చెందిన దూదిమెట్ల సరిత (35)భర్తతో గొడవపడి కొన్నేళ్లుగా భద్రాచలంలోని పెట్రోల్ బంక్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తోంది. భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ప్రైవేటుగా అటెండర్ పనిచేసే పోతురాజు గురుమూర్తి ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. సరిత దగ్గర డబ్బులు తీసుకోవడమే కాకుండా మానసికంగా ఇబ్బంది పెడుతున్నాడు. దీంతో వేధింపులు భరించలేక ఈ నెల 11న గడ్డి మందు తాగిన ఆమె చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదుతో గురుమూర్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ అశోక్ రెడ్డి తెలిపారు.



సరిత(ఫైల్)

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన చెల్లని చెక్కు జారీ చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ఒకటో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి బెక్కమ్ రజని సోమవారం తీర్పుచెప్పారు. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన కోటకొమ్ముల నాగరాజు వద్ద భద్రాద్రి జిల్లా పాల్వంచ వాసి బొందిలి రామారావు 2019 నంబర్‌లో రూ.8 లక్షల అప్పు తీసుకున్నారు. తిరిగి 2021 అక్టోబర్‌లో రూ.8లక్షలకు చెక్కు జారీ చేసినా ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో నాగరాజు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. విచారణ అనంతరం రామారావుకు జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.8లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

యువకుడిపై పోక్సో కేసు

ఖమ్మంక్రైం: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై ఖమ్మం త్రీటౌన్ పోలీసులు సోమవారం పోక్సో కేసు నమోదు చేశారు. ఖమ్మం జహీర్‌పుర ప్రాంతానికి చెందిన గోపి సుక్కు అదే ప్రాంతానికి బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ మోహన్‌బాబు తెలిపారు.

మక్కలు కొంటారా.. కొనరా?

- జిల్లాలో లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగు
- నూర్పిళ్లు పూర్తి చేసి గింజలు ఆరబెడుతున్న రైతులు
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటును ప్రకటించని మార్క్‌ఫెడ్
- అదే అదునుగా తక్కువ ధరకు దక్కించుకునేలా వ్యాపారుల యత్నం



మసివాగు గ్రామంలో మొక్కజొన్న కంకి నుంచి గింజలు వేరు చేస్తున్న రైతులు



ముత్తారపుకట్ట గ్రామ సమీపంలో రహదారిపై ఆరబెట్టిన మొక్కజొన్నలు

ఇల్లెందురూరల్: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తాత్సారంతో ఏటా రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాదీ అదే పరిస్థితి నెలకొంటోంది. అధిక వర్షాలు, వాతావరణ ప్రతికూలత నడుమ సాగు చేసిన రైతులకు చివరకు గిట్టుబాటు ధర కూడా లభించడంలేదు. గతేడాది మిర్చి, పత్తి సాగులో తీవ్రంగా నష్టపోయిన రైతులు ఈ ఏడాది మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపారు. జిల్లాలో మొక్కజొన్న లక్ష ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఖరీఫ్‌లో మొక్కజొన్న ఎకరం విస్తీర్ణంలో 25 క్వింటాళ్లు, రబీలో 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అతివృష్టి, అనావృష్టి కారణంగా ఈ దఫా ఎకరానికి అత్యధికంగా 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఈ లెక్కన జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో కనీసం 15 లక్షల క్వింటాళ్ల మక్కలు ప్రస్తుతం మార్కెట్‌కు చేరే అవకాశం ఉంది.

పెరిగిన పెట్టుబడి

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాభావంతో విత్తనాలు మొలకెత్తలేదు. రెండో దఫా విత్తాల్సి రావడంతో పెట్టుబడి భారం పెరిగింది. మొక్క ఎదుగుతున్న దశలో వర్షాభావం తీవ్ర ప్రభావం చూపింది. ఆ తర్వాత అధిక వర్షాలు కోలుకోకుండా చేశాయి. ప్రధానంగా కంకి పాలుపోసే దశలో, గింజ పక్వానికి వచ్చే దశలో ప్రతికూల వాతావరణం దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఫలితంగా ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి 15 క్వింటాళ్లకు పడిపోయింది.


ధర తగ్గిస్తున్న దళారులు

ఈ సారి ప్రభుత్వం మొక్కజొన్నకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,400గా నిర్ణయించింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కాకపోవడంతో దళారులు మక్కల ధరను తగ్గించేశారు. క్వింటాల్‌కు రూ.1,600 నుంచి రూ.1,700 వరకు చెల్లిస్తామని చెబుతున్నారు. దీంతో రైతులు క్వింటాకు రూ.700 నుంచి రూ.800 వరకు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు వర్షం ఎప్పుడు వస్తుందో తెలియక అయోమయ పరిస్థితి నెలకొంది.

కొనుగోలు కేంద్రాల ఊసేది?

మక్కల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మార్క్‌ఫెడ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. కానీ ఏటా సగం పంటను దళారులు కొన్నాక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో దళారులు మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో విక్రయించుకుని అధిక ధర పొందుతున్నారు. ప్రస్తుతం రైతులు చేలల్లో మక్క కండెలను విరిచి యంత్రాల ద్వారా గింజలు వేరు చేసి తేమ శాతం కోసం కల్లాల్లో, రహదారులపై ఆరబెట్టుకుంటున్నారు. ఇప్పటికే సగం విస్తీర్ణంలో కోతలు పూర్తయ్యాయి. చీడపీడలు, వాతావరణ అననుకూల పరిస్థితుల నేపథ్యంలో దిగుబడి తక్కువగా వచ్చినా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే కనీస మద్దతు ధరైనా దక్కుతుందని రైతులు ఆశిస్తున్నారు. కానీ ఇప్పటివరకు మార్క్‌ఫెడ్ నుంచి కొనుగోలు కేంద్రాల ఊసే లేదు.

కేంద్రాలు ప్రారంభించాలి



ఐదెకరాల్లో మక్కలు పంట సాగు చేశాను. కోతలు పూర్తి చేసుకుని తేమ శాతం కోసం గింజలను ఆరబెట్టుకుంటున్నాను. అధిక వర్షాలతో దిగుబడి బాగా తగ్గింది. క్వింటా రూ.1,700 చొప్పున కొంటామని వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే దిగుబడి తగ్గినా మద్దతు ధరైనా దక్కుతుంది.

–బానోత్ బాలు, రైతు, ధర్మారంతండా, ఇల్లెందు మండలం

గ్రామాల్లో అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి

చుంచుపల్లి: వైద్య బృందాలు గ్రామాల్లో పర్యటిస్తూ కేన్సర్, బీపీ, షుగర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జయలక్ష్మి అన్నారు. సోమవారం కొత్తగూడెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆహారపు అలవాట్లను సైతం సూచించాలన్నారు. కేన్సర్, బీపీ, షుగర్ వంటి వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించి, డేటాను ఆలస్యం లేకుండా నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్లు మధువరణ్, శ్రీకాంత్ ఫ్రంట్‌లైన్ వర్కర్లు పాల్గొన్నారు.

మేళ్లమడుగులో పూరిల్లు దగ్ధం

కాలిబూడిదైన సర్టిఫికెట్లు, నగదు, సామగ్రి



దగ్ధమవుతున్న పూరిల్లు

టేకులపల్లి: అగ్ని ప్రమాదంలో సోమవారం పూరిల్లు దగ్ధమైంది. మండలంలోని మేళ్లమడుగు గ్రామానికి చెందిన వట్టం నాగేశ్వర్‌రావు, జానకి దంపతులు ఇంటికి తాళం వేసి ఇద్దరు కుమార్తెలతో కలిసి పెట్రాంచెలక వెళ్లారు. షార్ట్ సర్క్యూట్‌తో భారీగా మంటలు చెలరేగి ఇల్లు దగ్ధమైంది. రూ. 50వేల నగదు, ఇద్దరు కుమార్తెల డిగ్రీ, నర్సింగ్ కోర్సులు, ఇతర సర్టిఫికెట్లు, బట్టలు, మంచాలు, వంట సామగ్రి , ధాన్యం కాలిపోయాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులను ఓదార్చారు. ఆర్థిక సాయం అందించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్‌ఐ సౌజన్య ప్రమాద వివరాలు నమోదు చేసుకుని తక్షణ సాయం కింద బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, 5వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్కినేని సురేందర్, కోరం సురేందర్, సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ రాజేందర్, ఈది గణేష్, రెడ్యానాయక్, మాడె మధు, మంగీలాల్, సరిత, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో సామగ్రి..

అశ్వాపురం : మండలకేంద్రంలోని మంచికంటి నగర్‌కు చెందిన సరస్వతి ఇంట్లో సోమవారం సామగ్రి దగ్ధమైంది. ఇంట్లో దేవుడి వద్ద వెలిగించిన దీపం నుంచి మంటలు వ్యాపించి బట్టలు, సామాన్లు, సిమెంట్ రేకులు, ఎల్‌ఈడీ టీవీ కాలి పోయాయి. సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లింది. ఆర్‌ఐ లీలావతి ఇంటిని పరిశీలించి నష్టం వివరాలు నమోదు చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.

వేధింపుల కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పోలీసులు సోమవారం వేధింపుల కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీకి చెందిన మడిపల్లి సంధ్యకు రాజాతో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లి జరిగిన కొన్ని నెలల నుంచే భర్త రాజా, అత్త లక్ష్మి అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో ఆమె భర్త, అత్తపై ఎస్‌ఐ సతీష్ కేసు నమోదు చేశారు.